పశు వైద్యశాలకు మోక్షం ఎప్పుడో..?!

- ప్రారంభానికి ముందే నిరుపయోగంగా మారిన వైనం
- ఇబ్బందులు పడుతున్న పశు, జీవాల కాపర్లు
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న పులిచింతల నిర్వాసితులు



ముళ్ల చెట్లు, పొదలతో నిండి ఉన్న పశు వైద్యశాల

రాజుపాలెం: లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కట్టించిన పశు వైద్యశాల భవనం నిరుపయోగంగా పడి ఉంది. ప్రస్తుతం ఆ భవనం ముళ్ల కంచెలతో నిండిపోయి ఉంది. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని చుట్టుపక్కల కుటుంబాల వారు వాపోతున్నారు. అక్రమార్కులు భవనానికి ఉన్న తలుపులను, కిటికీలను ధ్వంసం చేశారు. ఇది మండల కేంద్రంలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలో పశువుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పశు వైద్యశాల దుస్థితి.

ఉపయోగంలోకి తేవాలి

సంబంధిత శాఖకు అప్పచెప్పని అధికారులు మండల కేంద్రంలోని రాజుపాలెం పంచాయతీ పరిధిలో పులిచింతల నిర్వాసిత కేంద్రంను మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అన్ని హంగులతో ఏర్పాటు చేశారు. నిర్వాసిత కేంద్రంలో ముంపు గ్రామాలైన కోళ్లూరు, గొల్లపేట, గోపాలపురం, చిట్యాలతండా, భోదనం, కేతవరంలకు చెందిన కుటుంబాల వారికి 391 ప్లాట్లు కేటాయించారు. ఇంకా కొన్ని ప్లాట్లు ఖాళీగా మిగిలి ఉన్నాయి. నిర్వాసిత కుటుంబాలలో చాలా వరకు పశువులను, జీవాలను మేపుకుంటూ వాటిపై ఆధారపడి జీవిస్తున్నారు. వారి కోసం లక్షలు ఖర్చు పెట్టి పశు వైద్యశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దారు. నిర్వాసిత కేంద్రంలో సుమారు పశువులు 200, ఆవులు 20, జీవాలు 300 ఉన్నట్లు తెలుస్తుంది. కానీ వాటికి రోగాలు వచ్చినప్పుడు వైద్యులు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. జీవాలకు రోగాలు వస్తే మండల కేంద్రం రాజుపాలెం పశు వైద్యశాలకు తీసుకువెళ్లాల్సి వస్తోందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక రాత్రి సమయాల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారిందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

- నిర్వాసిత కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వ పశు వైద్యశాలనైతే నిర్మించారు. కానీ అప్పటి పులిచింతల ప్రాజెక్టు అధికారులు నిర్వాసిత కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏ కార్యాలయాన్నీ కూడా రాజుపాలెం పంచాయతీకి, ఆయా సంబంధిత శాఖలకు అప్పచెప్పలేదు. దీంతో ఆ భవనాలను పట్టించుకునే అధికారులే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పశు వైద్యశాలను వినియోగంలోకి తేవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి



నిర్వాసిత కేంద్రంలో లక్షలు ఖర్చు చేసి పశు వైద్యశాలను నిర్మించారు. కానీ వైద్యులను ఏర్పాటు చేయలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరుపయోగంగా ఉన్న పశు వైద్యశాల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని వైద్యులను నియమించాలి.

– ముల్లా సుధాకర్, నిర్వాసితుడు

ఇబ్బందులు పడుతున్న పశు కాపరులు



భవనం అయితే ఉంది. కానీ వైద్యులు లేరు. దీని వలన పశు, జీవాల కాపరులు ఇబ్బందులు పడుతున్నారు. భవనాన్ని పశు సంవర్ధక శాఖకు అప్పగించి ఉపయోగంలోకి తేవాలని అధికారులను కోరుతున్నాం.

– మెరుగు లక్ష్మయ్య, నిర్వాసితుడు

దేవరశెట్టి శ్రీనివాసరావు మృతి తీరనిలోటు


నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి, మండల కన్వీనర్ భవనం

నకరికల్లు: సీనియర్ నాయకుల మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. చీమలమర్రి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ దేవరశెట్టి శ్రీనివాసరావు అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. శ్రీనివాసరావు మృతదేహానికి ఆదివారం డాక్టర్ గజ్జల నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ చీమలమర్రి గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని, గ్రామ స్థాయిలో పార్టీకి పునాదులు వేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. శ్రీనివాసరావు మృతి మండలంలోని నాయకులు, కార్యకర్తలను కలచి వేసిందన్నారు. దేవరశెట్టి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల బాషా, అలపర్తి భాస్కరరావు, మద్దం సురేష్, కావేటి రామారావు, తిరుములశెట్టి సాంబయ్య, దొండేటి కోటిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధ్యాయులుగా క్రోసూరు నుంచి ముగ్గురికి అవకాశం


షేక్ హసీనా



పోతురాజు కామేష్


కంభంపాటి డానియేల్

క్రోసూరు: ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో క్రోసూరు నుంచి ముగ్గురు అభ్యర్థులు హిందీ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. 23 సంవత్సరాల తరువాత ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు అభ్యర్థులు ఉద్యోగాలు సాధించినట్లు ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ ప్రతినిధి బోళ్ల నరసింహారెడ్డి ఆదివారం తెలిపారు. క్రోసూరుకు చెందిన షేక్ షాహినా (ఎస్ఏ) జిల్లాలో ఐదవ ర్యాంకు సాధించగా, పోతురాజు కామేష్(ఎస్ఏ) జిల్లా 17వ ర్యాంకు, బీసీ–సీ క్యాటగిరీలో కంభంపాటి డానియేల్ (ఎస్ఏ,టీజీటీ) ఉద్యోగాలు సాధించారు. 2002 డీఎస్సీలో క్రోసూరుకు చెందిన ముప్వా మాధవ్, తిరుమలసింగ్, ఎస్తేరులకు హిందీ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు వచ్చాయి. ఆ తరువాత 2025లో ముగ్గురికి వచ్చినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్నారని అన్నారు.

సందడిగా గణపతి నవరాత్రులు


సత్తెనపల్లి పాతబస్టాండ్‌లో పూజలందుకున్న వినాయకుడు


సత్తెనపల్లి కోటమ్మసత్రంలో పూజలందుకున్న వినాయకుడు


బెల్లంకొండలో కొలువుదీరిన గణనాథుడు


అచ్చంపేటలో విఘ్నేశ్వరుని విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమంలో చిన్నారులు


నిమజ్జనానికి తరలుతున్న క్రోసూరు ఎన్టీఆర్ సెంటర్‌లోని చౌదర్ల సంఘం వినాయకుడు


వినాయక నిమజ్జన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల

సత్తెనపల్లి /అచ్చంపేట / క్రోసూరు/ బెల్లంకొండ/ నకరికల్లు / ముప్పాళ్ళ: గణపతి నవరాత్రులు సందడిగా కొనసాగుతున్నాయి. బహురూపాల్లో మండపాల్లో కొలువైన వినాయకుడి విగ్రహాల వద్ద సందడిగా పూజలు చేస్తున్నారు. ఐదవ రోజు ఆదివారం వినాయక మండపాల వద్ద భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. వాడవాడలా ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు నిర్వహించి కొన్ని వినాయక విగ్రహాల వద్ద అన్న సంతర్పణలు చేపట్టగా, మరికొన్ని విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఆయా కమిటీల బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లడ్డూ ప్రసాదాలకు వేలం నిర్వహించారు.


నిమజ్జనానికి తరలుతున్న క్రోసూరు కొండకింద బజారులోని గౌడ సంఘం వినాయకుడు


ముప్పాళ్ళలో లడ్డూ ప్రసాదాన్ని రూ.1లక్ష 16 వందలకు దక్కించుకుని తీసుకెళ్తున్న దృశ్యం

వైఎస్సార్ వర్ధంతికి నూతన హంగులు


తీన్‌మార్ బృందంతో వైఎస్సార్‌సీపీ నాయకులు

అచ్చంపేట: ఈ నెల 2న జరిగే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమానికి మండలంలోని మాదిపాడులో వైఎస్సార్ విగ్రహంతోపాటు, భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ అంబేడ్కర్, సామాజిక నాయకులు వంగవీటి మోహనరంగా విగ్రహాలకు నూతనంగా రంగులు వేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం మాట్లాడుతూ తమ ప్రియతమ నాయకుడు డాక్టర్ వైఎస్సార్ తమ నుంచి దూరమై 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామ సర్పంచ్ మాదా వెంకట్రావు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరగనుంది. సత్తెమ్మతల్లి దేవస్థాన కమిటీ చైర్మన్ కొరివి వెంకట నరేష్ 30 మంది తీన్‌మార్ బృందానికి టీషర్టులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీఎంగా ఉండగా ఈ గ్రామానికి రెండు పర్యాయాలు వచ్చారని, 2004లో మాదిపాడు పంచాయతీ పరిధిలో పులిచింతల ప్రాజెక్టు శంకుస్థాపనకు, 2008లో నిర్మాణంలో ఉన్న పులిచింతల ప్రాజెక్టు వద్ద రైతు సదస్సుకు వచ్చారన్నారు. ఒకప్పుడు 400 అడుగుల లోతులోనూ చుక్కనీరు బోర్లు, పులిచింతల ప్రాజెక్టు పూర్తవ్వడంతో 100 అడుగులలోపే పడుతున్నాయని, అందుకే తమ గ్రామం మహానేతను దైవంగా భావిస్తామని గ్రామస్తులు చెబుతున్నారు.

సమాజ నిర్దేశకులు గురువులు


వేదాంతం కోదండరామాచార్యులును సత్కరించి మెమెంటో అందిస్తున్న విఖనస మండలి బాధ్యులు

సత్తెనపల్లి: సమాజ నిర్దేశకులు గురువులేనని విఖనస మండలి ఉపాధ్యక్షుడు గుడిపూడి తులసికృష్ణ భట్టు అన్నారు. నరసరావుపేటలోని మున్సిపల్ బాలుర పాఠశాలలో ఆర్ట్స్ ఉపాధ్యాయుడిగా గత 35 సంవత్సరాలుగా పనిచేస్తూ ఆదివారం పదవీ విరమణ పొందిన వేదాంతం కోదండ రామాచార్యులు (రాంబాబు) సన్మాన మహోత్సవంలో భాగంగా సత్కరించి మెమెంటో అందించారు. ఈ సందర్భంగా తులసికృష్ణ భట్టు మాట్లాడుతూ ఉపాధ్యాయులు రోజులో మూడో వంతు సమయాన్ని విద్యార్థులతో గడుపుతారని, ఆ సమయంలో వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తారన్నారు.

బోధనలో మంచి నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులను విద్యార్థులు ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారన్నారు. ఈ సందర్భంగా వేదాంతం కోదండ రామాచార్యులు సేవలను పలువురు కొనియాడారు. అనంతరం ఆయనను సత్కరించి మెమెంటో అందించారు. కార్యక్రమంలో విఖనస మండలి బాధ్యులు నల్లూరి శ్రీనివాస్, నారాయణ లక్ష్మీనారాయణ, పుసులూరి సంపత్‌కుమార్, పెద్దింటి ఫణికృష్ణ, వేదాంతం రామకృష్ణమాచార్యులు, వేదాంతం శ్రీనివాస్, వేదాంతం భార్గవనాథ్, వేదాంతం విజయ నసింహాచార్యులు, వేదాంతం కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాలలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం


మల్లాదిలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అమరావతి: మండల పరిధిలోని దిడుగు, మల్లాది, జూపూడి, మునగోడు గ్రామాలలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ జననేత జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి మోసాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందన్నారు. హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చకపోవటాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలోకి రావడం కోసమే అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేశారన్నారు. అనంతరం బాబు మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. గ్రామస్తుల ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించి, యాప్‌ను ఎలా వాడాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి కోటేశ్వరరావు, పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అలా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు సాంబశివరావు, పార్టీ అధికార ప్రతినిధి ఏకుల అన్నపాములు దిడుగు, మల్లాది, మునగోడు, ఎండ్రాయి గ్రామాల సర్పంచ్‌లు వింతా శ్రీలక్ష్మీ, వెంపా నాగమణి, బంకా విష్ణునాయుడు రాంబాబు, మండల వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వింతా అనూషా, నియోజకవర్గ ఆర్ఎంపీ వైద్యుల విభాగం అధ్యక్షుడు షేక్ షరీఫ్, నాయకులు వీరరాఘవయ్య, వెంపా వాసు, తేళ్ల రోశయ్య, శివనాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గుడివాడ మత్తయ్య, మరియదాసు, మాజీ ఎంపీటీసీ జెట్టి నాగరాజు, డేవిడ్, పున్నారావు, జెట్టి సాగర్, ఏకుల సుందరయ్య, బత్తుల అంకమరావు, షేక్ రహీమ్, చేయూరి శంకర్, మునగోడు ఉప సర్పంచ్ మస్తాన్ షరీఫ్, ముక్కమళ్ళ నరసింహారెడ్డి, గణపా సైదారెడ్డి, నర్సిరెడ్డి, బంకాబాబు, నన్నేబుడే, సలావుద్దీన్, పలు అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు సేవలందించటంలోనే ఆనందం



అమరావతి: రైతలకు నిరంతరం సేవలందించటంలోనే తాను ఆనందం పొందానని మునగోడు ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘం లిమిటెడ్ సీఈవోగా ఉద్యోగ విరమణ చేసిన సాంబశివరావు అన్నారు. ఆదివారం సొసైటీ ఆవరణలో నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ సుమారు 39 సంవత్సరాలపాటు మునగోడు సొసైటీలో రైతులకు సేవలందించానన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే మునగోడు సొసైటీ మొదటి స్థానంలో నిలవటం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ సందర్భంగా మునగోడు సొసైటీ చైర్‌పర్సన్ నాగోతు నాగార్జున, జీడీసీసీ బ్యాంకు విశ్రాంత మేనేజర్ పి.శివన్నారాయణ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు సాంబశివరావు, చంద్రకళ దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి ఆయన సేవలు మరువలేమని శేష జీవితాన్ని సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



పెదకూరపాడు: ఆగస్టు 18వ తేదీన సాక్షి దినపత్రికలో 'కూలేలా ఉంది కనికరించండి సారూ..' అంటూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభంపై ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. పెదకూరపాడులోని ప్రధాన రహదారిలో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద ఉన్న విద్యుత్ స్తంభం కింద భాగంలో ఇనుప ఊచలు బయటపడి పక్కకు ఒరిగి ప్రమాదంగా ఉంది. దీంతో స్థానికులు, భక్తులు భయాందోళన వ్యక్తం చేశారు. దీనిపై పెదకూరపాడు విద్యుత్ ఏఈ దాసరి రామకృష్ణ స్పందించి శనివారం సాయంత్రం ప్రమాదకరంగా ఉన్న స్తంభం పక్కన నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు, భక్తులు సాక్షి పత్రికకు, విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం



నకరికల్లు: సేవా కార్యక్రమాలలో పేదలను ఆదుకుంటామని గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సభ్యులు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్‌రఫీ పిడుగురాళ్ల సున్నం మిల్లులో రాళ్లు కొట్టేపని చేస్తుండగా కంటికి తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం తెలుసుకున్న గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ మానవత్వంతో ఆ కుటుంబానికి సహాయంగా నగదు, బియ్యం, కిరాణా సరుకులు అందించారు. కార్యక్రమంలో గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గుండు మస్తాన్‌వలి, గుత్తికొండ మహబూబ సుభాని, జమాల్ అల్లాభక్షు, కరాలపాటి సైదావలి తదితరులు పాల్గొన్నారు.

జ్వర పీడితులకు హోమియో మందులు పంపిణీ



అచ్చంపేట: స్థానిక వీరభద్రస్వామి కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు జ్వర పీడితులకు, వ్యాధులకు గురికాకుండా ముందస్తు చర్యలలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం హోమియో మందులు పంపిణీ చేశారు. కాలనీలో దోమల దాడి ఎక్కువగా ఉన్నందున చికెన్‌గున్యా, డెంగీ వంటి వ్యాధులకు గురికాకుండా ముందుస్తుగా హోమియో మందులు పంపిణీ చేస్తున్నట్లు సీపీఎం మండల నాయకులు హనుమంతరావు తెలిపారు. తామిచ్చే హోమియో పిల్స్ వారానికి రెండు చొప్పున వాడినట్లయితే విష జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఆర్ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మస్తాన్ బుజ్జి సంపంగి ఏడుకొండలు, మీరసాబుడే తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



అచ్చంపేట: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక, పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల ఆధ్వర్యంలో అచ్చంపేటలో భగవద్గీత ప్రాముఖ్యతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇందూ ధర్మ భగవద్గీత గ్రంథాలను ఇంటింటా పంపిణీ చేశారు. స్థానిక విద్వాన్ హైస్కూలులో కమిటీ సభ్యులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చర్చ నిర్వహించారు. భూమి మీద అవతరించిన మహోన్నత వ్యక్తే శ్రీకృష్ణ భగవానుడని చెప్పారు. పూర్వం కృష్ణాష్టమి వేడుకలను 11 రోజులపాటు నిర్వహించి వినాయక చవితి రోజు ముగించేవారని చెప్పారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు కటకం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, సభ్యులు కె.అరుణ, కె.కార్తీక్, నారాయణమ్మ, అనూరాధ, వెంకటలక్ష్మి, శ్రీని, వీరయ్య, రాఘవ, సుందరం, రామాంజనేయులు, గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతికి తరలిరండి

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రయ్య

అచ్చంపేట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం ఈ నెల 2న స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద జరగనుందని, మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలిరావలసినదిగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ పెదకూరపాడు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరవుతారని చెప్పారు.

గంగమ్మతల్లి చెరువుకు బహిరంగ వేలం

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లు పంచాయతీ పరిధిలోని గంగమ్మతల్లి చెరువులో చేపలు పట్టుకునేందుకు ఈ నెల 4వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ రమీజ్, సర్పంచ్ సీహెచ్ జయశ్రీలు ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని, పంచాయితీరాజ్ నిర్దేశించిన షరతులకు వేలం జరుగుతుందన్నారు. తుది నిర్ణయం పంచాయతీ కార్యదర్శిదేనని చెప్పారు.

15 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

సత్తెనపల్లి: పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు పట్టణంలోని మన్యం రెసిడెన్సీ లాడ్జిలో శనివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. లాడ్జిలోని రూమ్ నెంబర్ 307లో పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,45,670 నగదు, 21 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్ఐలు పవన్ కుమార్, శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఆవోపా గుంటూరు జిల్లాలో సత్తెనపల్లి వాసులకు చోటు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్(ఆవోపా) అసోసియేషన్ గుంటూరు జిల్లాలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి వాసులు ముగ్గురికి చోటు లభించింది. ఆదివారం గుంటూరు అరండల్ పేట 7వ లైనులో ఉన్న గుంటూరు ఆవోపా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చింతా కృష్ణారావు చేతుల మీదుగా వారు నియామక పత్రం అందుకున్నారు. వారిలో సత్తెనపల్లి పట్టణానికి చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ యక్కల సుధాకరరావును జిల్లా ఉపాధ్యక్షుడిగా, న్యాయవాదులు చలువాది చిన సత్యనారాయణ, దివ్వెల శ్రీనివాసరావు జిల్లా కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. వీరి పదవీకాలం రెండు సంవత్సరాల పాటు ఉంటుంది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యవర్గ బాధ్యులు, వివిధ పట్టణాల్లో ఉన్న ఆవోపా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.